## సంక్షిప్త వార్తలు

### అయోధ్య రామాలయ ప్రధాన పూజారి కన్నుమూత

లక్నో, జూన్ 22: అయోధ్యలో బాల రాముడి విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ చేసిన ప్రధాన పూజారి పండిట్ లక్ష్మీకాంత్ దీక్షిత్ (86) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన..శనివారం ఉదయం తుదిశ్వాస విడిచినట్టు కుటుంబసభ్యులు వెల్లడించారు. విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి 121 మంది వేద పండితుల్ని ఎంపిక చేయగా, ఈ బృందానికి లక్ష్మీకాంత్ దీక్షిత్ నేతృత్వం వహించారు. కాశీ పట్టణంలో పేరొందిన పండితుల్లో ఒకరిగా దీక్షిత్ గుర్తింపు అందుకున్నారు. ఆయన మృతిపట్ల ప్రధాని మోదీ, ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్‌లు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

### ఈడీ సోదాల్లో కోటి నగదు, 100 బులెట్లు సీజ్

రాంచీ, జూన్ 22: భూఆక్రమణకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఈడీ అధికారులు రాంచీలో సోదాలు చేపట్టారు. తనిఖీల్లో భాగంగా రూ. కోటి నగదు, 100 బులెట్లను స్వాధీనం చేసుకొన్నట్టు అధికారులు శనివారం వెల్లడించారు. కమలేశ్ సింగ్ అనే వ్యక్తికి చెందిన నివాసంలో శుక్రవారం సాయంత్రం సోదాలు చేశామని తెలిపారు. జార్ఖండ్ మాజీ సీఎం, జేఎంఎం నేత హేమంత్ సొరేన్‌పై నమోదైన భూఅక్రమణల ఆరోపణల కేసులో భాగంగా ఈ సోదాలు చేసినట్టు, ఇది వేరే ప్లాట్‌కు సంబంధించిందని ఈడీ వర్గాలు తెలిపాయి. ఈ కేసులో ఇప్పటి వరకు సొరేన్ సహా 25 మందినిపైగా ఈడీ అరెస్టు చేసింది.

### నటుడు దర్శన్ కస్టడీ జూలై 4 వరకు పొడిగింపు

బెంగళూరు, జూన్ 22: అభిమాని రేణుకాస్వామి హత్య కేసులో అరెస్టయిన కన్నడ నటుడు దర్శన్, మరో నలుగురికి కోర్టు శనివారం జ్యుడీషియల్ కస్టడీ విధించింది. జూన్ 11 నుంచి పోలీస్ కస్టడీపై ఉన్న నిందితులకు జూలై 4 వరకు జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ తీర్పు వెలువరించింది. దీంతో నటుడు దర్శన్ సహా మిగతావారిని బెంగళూరులోని పరప్పనా అగ్రహారలోని సెంట్రల్ జైల్‌కు తరలించారు. ఈ హత్య కేసులో మొత్తం 17 మందిని పోలీసులు నిందితులుగా చేర్చారు.

### ఆతిశీ నిరాహార దీక్షలో కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా నినాదాలు

న్యూఢిల్లీ, జూన్ 22: దేశ రాజధాని ఢిల్లీలో నీటి సంక్షోభంపై ఆ రాష్ట్ర జల మంత్రి ఆతిశీ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష శనివారం రెండో రోజుకు చేరుకుంది. కాగా దీక్షను చేపట్టిన చోట కొంతమంది కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేయటంతో కొద్దిసేపు గందరగోళం ఏర్పడింది. దీక్షను అడ్డుకునే ప్రయత్నం చేసిన వారిని ఆప్ కార్యకర్తలు బయటకు తీసుకెళ్లటంతో, మంత్రి ఆతిశీ నిరాహార దీక్షను కొనసాగించారు. నిరాహార దీక్ష కారణంగా శనివారం రాత్రి ఆతిశీ బ్లడ్ షుగర్ స్థాయిలు 16 పాయింట్లు, రక్తపోటు పడిపోయాయి.

### 39 ఏండ్లుగా కొనసాగుతున్న 'కనిష్క' దర్యాప్తు

ఒట్టావా: 1985 నాటి కనిష్క విమానం బాంబు పేలుడు కేసులో దర్యాప్తు ఇంకా క్రియాశీలంగానే ఉన్నదని, కొనసాగుతున్నదని కెనడా పోలీసులు వెల్లడించారు. అత్యంత క్లిష్టమైన దేశీయ ఉగ్రవాద కేసుల్లో ఇది ఒక 'దీర్ఘకాలం'గా జరుగుతున్న దర్యాప్తు అని పేర్కొన్నారు. 39 ఏండ్ల క్రితం 1985, జూన్ 23న కెనడాలోని మాంట్రియల్ నుంచి ఢిల్లీకి బయలుదేరిన ఎయిరిండియా 'కనిష్క' విమానం 182 లండన్ ఎయిర్‌పోర్టులో దిగే 45 నిమిషాల ముందు పేలిపోయింది. విమానంలో ఉన్న 329 మంది మరణించారు. 1984లో జరిగిన 'ఆపరేషన్ బ్లూస్టార్'కు వ్యతిరేకంగా సిక్కు మిలిటెంట్లు ఈ బాంబు పేలుడుకు పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నాయి.

# చౌహాన్ ముందు 'ఢిల్లీ' తలవంచింది!

- లోక్‌సభ ఎన్నికల్లో భారీ విజయమే కారణం
- ఇప్పుడు నా తండ్రి మరింత పాపులర్
- కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ కుమారుడు కార్తికేయ వ్యాఖ్యలు
- బీజేపీలో అసమ్మతి, పెద్ద నేతల తిరుగుబాటు భయం కనిపిస్తుందన్న విపక్ష పార్టీల నేతలు




భోపాల్, జూన్ 22: కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి, మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ కుమారుడు కార్తికేయ సింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో విదిశ స్థానం నుంచి శివరాజ్ బంపర్ మెజార్టీతో విజయం సాధించడంతో 'ఢిల్లీ మొత్తం నా తండ్రి ముందు తలవంచింది' అంటూ వ్యాఖ్యానించారు. శివరాజ్ సింగ్ చౌహాన్ సీఎంగా చాలా పాపులర్ వ్యక్తి అని, ఆయన సీఎంగా లేకున్నా మరింత పాపులర్ అయ్యారని పేర్కొన్నారు. బుధ్ని అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని భెరుండాలో శుక్రవారం జరిగిన బహిరంగ సభలో కార్తికేయ సింగ్ మాట్లాడుతూ ఎన్నికల్లో తన తండ్రికి మద్దతు పలికినందుకు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. 'ఒక సందేశం' పంపడంలో బుధ్ని ప్రజలు అద్భుతంగా పనిచేశారని అన్నారు. 'అంతకుముందు కూడా ముఖ్యమంత్రిగా మన నాయకుడు(చౌహాన్) పాపులర్ వ్యక్తి. సీఎంగా లేకున్నా ఆయన మరింత పాపులర్ ఎందుకయ్యారో నాకు తెలియదు. ఇప్పుడు మన నాయకుడు భారీ విజయం సాధించిన తర్వాత.. ఈరోజున ఢిల్లీ మొత్తం ఆయన ముందు తలవంచింది' అని కార్తికేయ సింగ్ పేర్కొన్నారు. ఢిల్లీ ఆయన్ను గుర్తించిందని, గౌరవించిందంటూ కేంద్రంలోని బీజేపీని ఉద్దేశించి వ్యాఖ్యలు చేసినట్టు తెలుస్తున్నది. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశంలోని టాప్ లీడర్లలో శివరాజ్ సింగ్ చౌహాన్ కూడా ఒకరని అన్నారు. కార్తికేయ సింగ్ వ్యాఖ్యల వీడియోను వివిధ పార్టీల నేతలు తమ సోషల్ మీడియా ఖాతాల్లో షేర్ చేస్తున్నారు. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జీతు పట్వారీ స్పందిస్తూ కార్తికేయ సింగ్ వ్యాఖ్యలను చూస్తే, బీజేపీలో అసమ్మతి భయం, పెద్ద నేతల తిరుగుబాటు భయం ఉన్నట్టు అర్థమవుతున్నదని అన్నారు. సంకీర్ణ ప్రభుత్వానికి మద్దతు తగ్గిపోతున్నదని, కుర్చీ కదిలిపోతున్నదని, ఢిల్లీ(కేంద్ర ప్రభుత్వం) భయపడుతున్నదని పేర్కొన్నారు.

**చౌహాన్‌ను కాదని మోహన్‌కు సీఎం పగ్గాలు..**

గత ఏడాది ఆఖరులో జరిగిన మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన బీజేపీ.. రాష్ర్టానికి నాలుగుసార్లు సీఎంగా చేసిన చౌహాన్‌ను(బుధ్ని నుంచి గెలిచారు) పక్కనపెట్టి, మోహన్ యాదవ్‌ను రాష్ట్ర కొత్త ముఖ్యమంత్రిగా చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కమలం పార్టీ శివరాజ్ సింగ్ చౌహాన్‌కు మధ్యప్రదేశ్‌లోని విదిశ స్థానం కేటాయించింది. ఎన్నికల్లో ఆయన 8.2 లక్షలకు పైగా భారీ ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థిపై విజయం సాధించారు. దీంతో కేంద్రంలో కొత్తగా ఏర్పడిన ఎన్డీయే ప్రభుత్వంలో శివరాజ్ చౌహాన్‌కు వ్యవసాయ శాఖ మంత్రి పదవి దక్కింది. ఈ పరిణామాల నేపథ్యంలోనే శివరాజ్ సింగ్ చౌహాన్ కుమారుడు కార్తికేయ సింగ్ తాజా వ్యాఖ్యలు చేసినట్టు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



### నలుగురు పిల్లలుంటే ఆదాయ పన్ను మినహాయింపు

*బుడాపెస్ట్, జూన్ 22: ప్రపంచ జనాభా నానాటికీ పెరిగిపోతున్నప్పటికీ కొన్ని దేశాల్లో జననాల రేటు గణనీయంగా తగ్గిపోతున్నది. అలాంటి దేశాల్లో హంగరీ ఒకటి. వివాహాలను ప్రోత్సహించడం ద్వారా దేశ జనాభాను పెంచేందుకు హంగరీ ప్రధాని విక్టర్ ఒర్బన్ వినూత్న చర్యలు చేపట్టారు. నలుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది సంతానం ఉన్నవారు జీవితాంతం ఆదాయ పన్ను కట్టాల్సిన అవసరం లేదని శుక్రవారం ప్రకటించారు. జనాభాను పెంచుకునేందుకు వలసదారులను ఆహ్వానించాల్సి వస్తుండటంతో తాము విభిన్న ఆలోచనలతో ముందుకొచ్చామని తెలిపారు. కనీసం నలుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలను కనే మహిళలకు ఆదాయ పన్నులో జీవితకాల మినహాయింపు ఇస్తామన్నారు. పెద్ద కుటుంబాలు పెద్ద కార్లను కొనుగోలు చేసుకునేందుకు సబ్సిడీ ఇస్తామని, పిల్లల పెంపకం కోసం దేశవ్యాప్తంగా 21 వేల శిశు సంరక్షణ కేంద్రాలను ప్రారంభిస్తామని తెలిపారు. వివాహాలను, జననాల రేటును పెంచేందుకు హంగరీ ప్రభుత్వం 2019లో మరో పథకాన్ని ప్రవేశపెట్టింది. ఆ పథకం కింద 41 ఏండ్లలోపు వయసులో పెండ్లి చేసుకున్న మహిళలకు సబ్సిడీపై కోటి ఫోరింట్స్ (దాదాపు రూ.27.57 లక్షల) రుణం ఇవ్వనున్నట్టు ప్రకటించింది.*

### ఎమర్జెన్సీలో టెలికంపై కేంద్రం నియంత్రణ

- ఏ నెట్‌వర్క్‌నైనా తన అధీనంలోకి తీసుకోవచ్చు
- ఈ నెల 26 నుంచి కొత్త టెలికం చట్టం అమలు

న్యూఢిల్లీ, జూన్ 22: కొత్త టెలికం చట్టం-2023 ఈ నెల 26 నుంచి అమల్లోకి రానున్నది. ఈ చట్టంలోని నిబంధనల ప్రకారం అత్యవసర పరిస్థితుల్లో ఏ టెలికమ్యూనికేషన్స్ సేవలు లేదా నెట్‌వర్క్‌నైనా తన నియంత్రణలోకి తీసుకొనే అధికారం కేంద్ర ప్రభుత్వానికి వస్తుంది. జూన్ 26 నుంచి అమల్లోకి వచ్చేలా టెలికమ్యూనికేషన్స్ యాక్ట్‌ను కేంద్రం శుక్రవారం నోటిఫై చేసింది. భద్రత, పబ్లిక్ ఆర్డర్, నేరాల నియంత్రణ కోసం ఏ సమయంలోనైనా కేంద్ర ప్రభుత్వం టెలికం సర్వీసులను తన అధీనంలోకి తీసుకోవచ్చని గెజిట్ నోటిఫికేషన్ చెబుతున్నది. విపత్తు నిర్వహణ వంటి ఏదైనా ప్రజా అత్యవసర పరిస్థితి ఏర్పడితే లేదా ప్రజల భద్రత ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం లేదా రాష్ట్ర ప్రభుత్వం లేదా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తరపున ప్రత్యేక అధికారాలు ఇచ్చిన ఏ అధికారి అయినా ఏ టెలికమ్యూనికేషన్ సర్వీస్‌నైనా లేదా నెట్‌వర్క్‌నైనా సంబంధిత సంస్థ నుంచి తాత్కాలికంగా తమ నియంత్రణలోకి తీసుకోవచ్చని సెక్షన్ 20 చెబుతున్నది.

### ఈ శునకం.. ప్రపంచంలోనే వికారం!

- నాలుగో ప్రయత్నంలో విజేతగా పీకింగీస్
- 50 ఏండ్లుగా సాగుతున్న వినూత్న పోటీలు



కాలిఫోర్నియా: ప్రపంచంలో అందమైన శునకాల పోటీ గురించి వింటుంటాం. కానీ దానికి భిన్నంగా అత్యంత వికారమైన(అంద విహీనమైన) శునకాల పోటీని అమెరికాలోని కాలిఫోర్నియాలో ఒక సంస్థ నిర్వహించింది. ఇటీవల జరిగిన ఈ పోటీలో ఆ కిరీటాన్ని ఎనిమిదేండ్ల పీకింగీస్ అనే పేరు గల కుక్క ఎగరేసుకుపోయింది. అత్యంత వికారంగా ఉన్న మరో ఏడు శునకాలను కాదని పికింగీస్ ఈ పోటీల్లో విజేతగా నిలిచింది. అంతకుముందు కూడా ఈ శునకం ఈ పోటీల్లో నాలుగుసార్లు పాల్గొన్నప్పటికీ విజయం సాధించడం మాత్రం ఇదే మొదటిసారి. కాగా, తామీ పోటీలను గత 50 ఏండ్లుగా నిర్వహిస్తున్నామని, అన్ని జాతుల కుక్కలు ఇందులో పాల్గొనవచ్చునని పోటీలు నిర్వహించిన సంస్థ తెలిపింది. పేరుకు వికారమైన శునకాలు అయినప్పటికీ చూడటానికి ఇవి చాలా అందంగా ఉన్నాయని నిర్వాహకులు వ్యాఖ్యానించడం విశేషం!

### విత్తన క్షేత్రం భూమి చదును

- పరిశీలించిన అధికారులు
- అక్రమంగా సాగుచేస్తే చర్యలు తప్పవని హెచ్చరిక



చదును చేసిన స్థలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

నాగిరెడ్డిపేట, జూన్ 22: మాల్తుమ్మెద విత్తన క్షేత్రంలోని సర్వేనంబర్ 835లో ఉన్న భూమిని గుర్తు తెలియని వ్యక్తులు చదును చేశారు. విషయం తెలుసుకున్న విత్తన క్షేత్రం ఏడీఏ వీరాస్వామి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విత్తన క్షేత్రంలో పడావుగా ఉన్న తుమ్మల కుంట చెరువు పక్క భూములను రాత్రి వేళలో గుర్తు తెలియని వ్యక్తులు చదును చేశారన్నారు. రాత్రి వేళలో పనిచేయడంతో విషయం వెంటనే బయటికి రాలేదన్నారు. విత్తన క్షేత్రం భూములను అక్రమంగా సాగుచేయడానికి ప్రయత్నిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. భూమి చదును చేసిన విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

### కామారెడ్డి జిల్లాకు తొమ్మిది సేవా పతకాలు

కామారెడ్డి, జూన్ 22 : పోలీసు శాఖలో విధి నిర్వహణలో చేసిన విశిష్ట సేవలకుగాను కామారెడ్డి జిల్లాకు చెందిన తొమ్మిది మంది అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం పతకాలను ప్రకటించింది. కామారెడ్డి జిల్లా అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ ఎం.జార్జి, పెద్దకొడప్‌గల్ ఎస్సై కోనారెడ్డి, కామారెడ్డి టౌన్ ఎస్సై తాజుద్దీన్, ఏఎస్సై నర్సయ్య, హెడ్ కానిస్టేబుళ్లు హైమద్, నర్సింహులు, హన్మాండ్లు, సాయిరెడ్డికి సేవా పతకాలు లభించినట్లు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేశాయి.

### టీయూ హెడ్‌కుక్ రాజేశ్ సస్పెన్షన్

డిచ్‌పల్లి, జూన్ 22 : టీయూ బాలికల వసతిగృహంలో శుక్రవారం ఉదయం అల్పాహారంలో బల్లి కళేబరం ఉండడంతో హెడ్‌కుక్ రాజేశ్‌ను రిజిస్ట్రార్ యాదగిరి శనివారం సస్పెండ్ చేశారు. అల్పాహారంలో బల్లి కళేబరాన్ని గుర్తించిన విద్యార్థినులు.. ఈ విషయాన్ని కేర్‌టేకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆ అల్పహారాన్ని పడేసి, తాజాగా వంట చేసి విద్యార్థులకు అందించారు. చీఫ్ వార్డెన్ ఆదేశాల మేరకు హాస్టల్ వార్డెన్‌పై హాస్టల్ కేర్‌టేకర్ విచారణ నిర్వహించి రిజిస్ట్రార్‌కు నివేదిక అందించారు. వీసీ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ యాదగిరి హెడ్‌కుక్ రాజేశ్‌ను సస్పెండ్ చేశారు. సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని, కిచెన్‌లో పరిశుభ్రత పాటించాలని ఆదేశించారు.

### పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

■ జడ్పీ సీఈవో ఉష



కూనేపల్లి పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో ఉష

రెంజల్, జూన్ 22 : అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ఎంపికైన పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని జడ్పీ సీఈవో ఉష.. పంచాయతీరాజ్ ఏఈని ఆదేశించారు. మండలంలోని కూనేపల్లిలో జడ్పీ, ప్రాథమిక పాఠశాలల్లో కొనసాగుతున్న పనులను ఆమె శనివారం పరిశీలించారు. పాఠశాలలో చేపట్టిన ఫ్లోర్లింగ్, మరుగుదొడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించలేదని కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతకుముందు ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన, రికార్డులను తనిఖీ చేశారు. సీఈవో వెంట ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో గణేశ్‌రావు కులకర్ణి, ఎంపీవో గౌసుద్దీన్, హెచ్‌ఎంలు అనురాధ, వసంతలక్ష్మి తదితరులు ఉన్నారు.

**నాణ్యమైన విద్యను అందించాలి**

ఎడపల్లి, జూన్ 22 : మండలంలోని ఎంఎస్సీ ఫారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను జడ్పీ సీఈవో ఉష శనివారం తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పాఠశాలలో తాగునీటి, సెప్టిక్ ట్యాంకులను పరిశీలించారు. మౌలిక వసతుల కల్పనలో లోటు రావొద్దని సూచించారు.

# మంటగలిసిన మానవత్వం

- మురికి కాలువ పక్కన పసికందు మృతదేహం
- పాముల బస్తీలో గుర్తించిన స్థానికులు
- జిల్లా దవాఖానకు తరలించిన పోలీసులు



పసికందు మృతదేహాన్ని పరిశీలిస్తున్న అధికారులు, పోలీసులు

వినాయక్‌నగర్, జూన్ 22: సమాజంలో రోజురోజుకూ మానవత్వం మంటగలుస్తున్నది. బంధాలు, అనుబంధాలు మాయమవుతున్నాయి. పేగుబంధాన్ని సైతం తుంచివేసుకుంటూ మనిషిలోని మృగతత్వాన్ని బహిర్గతం చేసుకుంటున్నాడు. నవమాసాలు మోసి, తన రక్తం పంచుకొని పుట్టి, కళ్లు తెరిచి లోకాన్ని కూడా చూడని ఓ పసిగుడ్డును మురికి కాలువ పాలు చేశారు. ఈ హృదయవిదారకర ఘటన నిజామాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం ఉదయం వెలుగుచూసింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు..

సుభాష్‌నగర్ పరిధిలోని జడ్పీ పక్కన పాముల బస్తీ ప్రాంతంలో ఉదయం 6.30 గంటల సమయంలో మురికి కాలువ పక్కన ఓ పసి కందును విగతాజీవిగా స్థానికులు గుర్తించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని పసికందు మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ దవాఖాన మార్చురీకి తరలించారు. విగతాజీవిగా లభించిన ఆడబిడ్డ సుమారు ఒక్కటి లేదా రెండు రోజుల క్రితం జన్మించి ఉంటుందని భావిస్తున్నారు. ఇదే పరిసర ప్రాంతంలో రెండు, మూడు రోజుల క్రితం ప్రసవించిన మహిళే ఈ దారుణానికి పాల్పడి ఉంటుందని పోలీసులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు తెలిసినవారు త్రీ టౌన్ ఎస్సై (87126-59839), నగర సీఐ (87126-59836, నిజామాబాద్ ఏసీపీ (87126-59807) నంబర్లకు సమాచారం ఇవ్వాలని త్రీ టౌన్ ఎస్సై ప్రవీణ్ కుమార్ కోరారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి చేస్తున్నట్లు తెలిపారు.

## వృద్ధాశ్రమ నిర్మాణం అభినందనీయం



వృద్ధాశ్రమం వద్ద మొక్కను నాటుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

**బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి**

బోధన్, జూన్ 22: బోధన్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధుల కోసం అన్ని సౌకర్యాలతో వృద్ధాశ్రమాన్ని నిర్మించడం అభినందనీయమని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఎడపల్లి మండలకేంద్ర శివారులో లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ నిర్మించిన వృద్ధాశ్రమం మొదటి అంతస్తును శనివారం ఆయన ప్రారంభించారు. వృద్ధాశ్రమం కోసం స్థలాన్ని విరాళంగా అందించిన కొత్తపల్లి శ్రీనివాస్‌రావు దంపతులను అభినందించారు. సుమారు రూ.3 కోట్లతో నిర్మించిన ఈ వృద్ధాశ్రమం సద్వినియోగమయ్యేలా చూడాల్సిన బాధ్యత క్లబ్ సభ్యులపై ఉందన్నారు. వృద్ధాశ్రమం అభివృద్ధి కోసం తన వంతు సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ పి.లక్ష్మీ బసవేశ్వరరావు, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, వృద్ధాశ్రమం ట్రస్ట్ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్‌రావు, ట్రస్ట్ కార్యదర్శి సూర్యనారాయణ, కోశాధికారి కటకం రమేశ్, లయన్స్ కంటి దవాఖాన ట్రస్ట్ చైర్మన్ టి.నర్సింహారెడ్డి, వృద్ధాశ్రమం ట్రస్ట్ సభ్యులు కొడాలి కిశోర్, యార్లగడ్డ శ్రీనివాస్, కె.సాంబిరెడ్డి, కె.సత్యనారాయణ (సత్యం), థమ్సప్ రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు డి.నాగేశ్వర్‌రావు, పులి శ్రీనివాస్, రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడాల్సిందే

- పోచారాన్ని ఆహ్వానించారంటే ఏదో మతలబు ఉంటుంది
- పార్టీ మాటను గౌరవించి ముందుకు సాగుదాం
- కాంగ్రెస్ నేత ఏనుగు రవీందర్‌రెడ్డి

బాన్సువాడ, జూన్ 22: 'కాంగ్రెస్ పార్టీ ఒక నిర్ణయం తీసుకుంటుంది. ఆ నిర్ణయానికి కట్టుబడి పని చేయాల్సిందే. సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా వెళ్లి ఎమ్మెల్యే పోచారంను ఆహ్వానించారంటే అందులో ఏదో మతలబు ఉంది. పార్టీ మాటను, సీఎం మాటను గౌరవించి మనం ముందుకు సాగాల్సిందేనని' కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం కామారెడ్డి జిల్లా బాన్సువాడలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన పార్టీ నాయకులతో మాట్లాడారు. అందరికీ అండగా ఉంటానని తిమ్మాపూర్ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద మాట ఇచ్చానని, నియోజకవర్గంలోనే ఇల్లు కట్టుకొని ఉంటానని చెప్పారు. ఒక చిన్న కార్యకర్తగా ఉండి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు.

## డిచ్‌పల్లికి ఇంజినీరింగ్ కళాశాలను మంజూరు చేయాలి




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

**మండల సభలో తీర్మానం**

డిచ్‌పల్లి, మే 22 : డిచ్‌పల్లి మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ నర్సయ్య అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి హాజరై మాట్లాడారు. మండల కేంద్రానికి ఇంజినీరింగ్ కళాశాల మంజూరు చేయాలని తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అధికారులు ప్రజలతో స్నేహపూర్వకంగా ఉంటూ పనిచేయాలని, సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో రేషన్ దుకాణాలకు ఇన్‌చార్జిలు ఉండరాదని, తక్షణమే ఖాళీల వివరాలతో కూడిన నివేదికను అందించాలని ఆదేశించారు. ధరణి, పోడు భూముల సమస్యలను 15 రోజుల్లో పూర్తిస్థాయిలో పరిష్కరించాలని తహసీల్దార్ ప్రభాకర్‌కు సూచించారు. న్యాయపరంగా పట్టాలు ఉన్నవారు సాగు చేసుకుంటే అడ్డుకోవద్దని అటవీ శాఖ సిబ్బందిని ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో పాఠశాలల్లో చేపట్టిన పనులు నిలిపివేయాలని, వాటికి బిల్లులు రావని స్పష్టం చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా గుర్తించిన పనులు మాత్రమే పూర్తి చేయాలని అన్నారు. అనంతరం ఇంజినీరింగ్ కళాశాలను మంజూరు చేయాలని, ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు స్థలం, మరొక కస్తూర్బా పాఠశాలను మంజూరు చేయాలని సభ్యులు ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు ఇందిర, ఎంపీపీ ఉపాధ్యక్షులు సాయిలు, ఎంపీడీవో రవీందర్, అధికారులు పాల్గొన్నారు.


**కళ్యాణమస్తు**

..మీ జీవిత భాగస్వామి ఎంపికలో ఆత్మీయ బంధువు

**శ్రీ సౌభాగ్య మ్యారేజ్ బ్యూరో**



రెడ్డి వధూవరులకు ప్రత్యేకంగా చూడబడును మరియు అన్ని కులముల పెండ్లి సంబంధములకు సంప్రదించండి:
16 Year's Experience
Dr. Smt. Konala Bhagyalakshmi Reddy,
Astrologer,
Ex:Telangana Marriage Bureau Association.
H.O.: షాప్ నెం.48, HMDA కాంప్లెక్స్, తార్నాక, హైదరాబాద్
B.O.: Opposite Sai Baba Temple, Dilsukhnagar,
Whatsapp: 9866044439

| వధువు కావలెను | వరుడు కావలెను |
| --- | --- |
| ★రెడ్డి:32 Yrs, 5'10", M.Tech(IIT), MS, Ph.D Sr. Sorftware USA, 180 K PA, 20 Cr Property గల వరునికి తగిన వధువు కావలెను. 9246960888 | ★రెడ్డి:28 Yrs, 5'4", BE, MBA (IIM), Manager, 32 LPA గల Well Settled వధువుకి తగిన వరుడు కావలెను. 9246960888 |
| ★రెడ్డి:29 Yrs, 5'10", B.Tech (Bitspilani), Software, 22 L P/A గల వరునికి తగిన వధువు కావలెను. 9030315599 | ★రెడ్డి:30 Yrs, 5'7", B.Tech, MS, Data Engg USA, 200K. PA, (Green Card) 30 Cr Property గల వధువుకి తగిన వరుడు కావలెను. 7207930999 |
| ★కాపు:29 Yrs, 6 ft, B.Tech., MS, Product Manager USA 150 K PA, H1-B, గల Well Settled వరునికి తగిన వధువు కావలెను. 9701960229 | ★కాపు:26 Yrs, 5'3", B.Tech(NIT), M.Tech(IIT), Software, 14 LPA, గల వధువుకి తగిన వరుడు కావలెను. 9030315599 |
| ★మున్నూరు కాపు:29 Yrs, 5'9", MBBS, MD, (General Medicine) Doctor గల Well Settled వరునికి తగిన వధువు కావలెను. 7207930999 | ★మున్నూరు కాపు:28 Yrs, 5'4", MBBS, MD, Doctor, 2LPM గల వధువుకి తగిన వరుడు కావలెను. 9248064777 |
| ★పద్మశాలి: 30 Yrs, 5'7", B.Tech, Sr. Automation Engg 2 L PM గల వరునికి తగిన వధువు కావలెను. 9248064777 | ★పద్మశాలి:30 Yrs, 5'4", B.Tech, Software, Hyd, 14 LPA, (Only Daughter) గల వధువుకి తగిన వరుడు కావలెను. 9010051444 |
| ★ముదిరాజ్: 30 Yrs, 5'11" B.Tech, Associate Manager 22 L PA గల వరునికి తగిన వధువు కావలెను. 9010051444 | ★గౌడ్స్: 26 Yrs, 5'6", B.Tech, MS, Software USA గల Well Settled వధువుకి తగిన వరుడు కావలెను. 9701960229 |
| ★గౌడ్స్: 29 Yrs, 5'9", B.Tech, Software, 8 L PA గల వరునికి తగిన వధువు కావలెను. 7207930999 | ★ముదిరాజ్: 29 Yrs, 5'2", B.Tech (IIT) Central Govt. Job 14 L PA గల వధువుకి తగిన వరుడు కావలెను. 9246960888 |
| ★మాల(హిందూ): 30 Yrs, 5'7", B.Tech., Software, 14 L PA గల వరునికి తగిన వధువు కావలెను. 9030315599 | ★మాల(హిందూ): 26 Yrs, 5'3", MBA, HR, 10L PA గల వధువుకి తగిన వరుడు కావలెను. 9701960229 |
| ★మాదిగ(హిందూ): 34 Yrs, 6 ft, B.Tech, Software 24 L PA, గల వరునికి తగిన వధువు కావలెను. 9246960888 | ★మాదిగ(హిందూ): 27 Yrs, 5'4", M.Tech, Software, 10L P/A గల వధువుకి తగిన వరుడు కావలెను. 9030315599 |
| ★Kshatriya (రెండవ పెళ్లి): 37 Yrs, 5'7", BPT & MPT, Physiotheraphy Doctor UK, 30 L PA గల వరునికి తగిన వధువు కావలెను. 9248064777 | ★Munnuru Kapu (రెండవ పెళ్లి): 35 Yrs, 5'2", MBA SWE 10L PA గల వధువుకి తగిన వరుడు కావలెను. 7207930999 |




**వరుడు కావలెను**

★కుల పట్టింపు లేదు: 21 Y, 22 Y, 23 Y, 25 Y, 27 Y, 29 Y, 31 Y, 33 Y, 35 Y, 37 Y, 39 Y, 40 Y, 41 Y, 43 Y, 45 Y, 47 Y, 49 Y, 50 Y, 51 Y, 53 Y, 55 Y, 56 Y, 57 Y, 59 Y "మా సేవ" (Since 1998) PH/WA: 9291503949.

4 లైన్ల ప్రకటనకు 500/- (+ GST అదనం)
ప్రతి అదనపు లైనుకు 125/-
9848077857